క్లుప్తంగా

కలసి మెలసి ఉండాలి



పల్లెనిద్రలో భాగంగా ప్రజలకు సూచనలిస్తున్న ఎస్‌ఐ అశోక్

పాములపాడు: గ్రామాల్లో ప్రజలంతా కలసి మెలసి ఉండాలని ఎస్‌ఐ అశోక్ అన్నారు. మండలంలోని తుమ్మలూరు గ్రామంలో మంగళవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారెవరైనా ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు. కక్షలు కార్పణ్యాలు పెంచుకుంటే జీవితాలు నాశనమవుతాయని, కుటుంబ అభివృద్ధి కుంటుపడుతుందని చెప్పారు. గ్రామాభివృద్ధిలో భాగస్వాములై ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు వరప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యాధికారిణి బదిలీ

పాములపాడు: స్థానిక ఆయుర్వేద వైద్యశాలలో వైద్యాధికారిణిగా విధులు నిర్వహిస్తున్న లవణ్య ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ముత్యాలపాడుకు బదిలీ అయ్యారు. పెద్దహరివరం నుంచి డాక్టర్ సావిత్రీ బదిలీపై ఇక్కడ వచ్చి మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

గాజులపల్లె వైద్యాధికారిగా డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి

మహానంది: గాజులపల్లె 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. జిల్లెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ శ్రీనివాసులును జిల్లెల్ల పీహెచ్‌సీకి బదిలీ చేశారు.

గాజులపల్లె రైల్వే గేట్ మూసివేత

మహానంది: మహానంది–గాజులపల్లె మార్గంలోని గాజులపల్లె రైల్వేస్టేషన్ వద్ద మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ మేరకు ఈ మార్గంలో మంగళవారం నుంచి జులై మూడో తేదీ వరకు రాకపోకలకు అంతరాయం ఉంటుందని, మహానంది నుంచి గాజులపల్లె మార్గం మీదుగా, గిద్దలూరు వైపు నుంచి గాజులపల్లె మీదుగా ఈ మార్గంలో వచ్చే ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహానంది: బండిఆత్మకూరు, తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూళ్లలో 7,8,9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు సయ్యద్ అబ్దుల్ రఫీ, లక్ష్మణరావులు తెలిపారు. బండిఆత్మకూరు ఏపీ మోడల్‌స్కూల్‌లో ఈ నెల 30న, తిమ్మాపురం జులై 1వ తేదీన రాతపరీక్ష ఉంటుందన్నారు.

ఎంపిక జాబితా ప్రదర్శన

మిడుతూరు: ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల జాబితా పాఠశాల నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు. ఎంపికైన విద్యార్థులు 04.07.23వ తేదీ లోపు సర్టిఫికెట్లు పాఠశాలలో అందజేసి అడ్మిషన్‌ను పొందాలని తల్లిదండ్రులకు కోరారు.

ఆరోగ్య కేంద్రంలో సేవలు భేష్



డాక్టర్ సుగుణ, సిబ్బందిని సన్మానించిన దృశ్యం

మిడుతూరు: సామాజిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు అందిస్తున్న సేవలు భేష్ అని ఇంటర్నేషనల్ మానవహక్కుల ఆర్గనైజేషన్ సభ్యులు గుల్జార్ అహమ్మద్ అన్నారు. మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తూ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన గైనకాలజిస్టు డాక్టర్ సుగుణ, బదిలీపై వెళ్లిన స్టాఫ్ నర్సు పుష్పలత, ల్యాబ్ టెక్నీషియన్ మహేశ్వరుడు, సబార్డినేట్ నూరుబాషాలను మానవహక్కుల ఆర్గనైజేషన్ సభ్యులు ఆధ్వర్యంలో సన్మానించారు. చిన్న పిల్లల వైద్యుడు తిరుపతి, సర్జన్ మధునాయక్, డాక్టర్ శారద పాల్గొన్నారు.

నేడు వాటర్ ప్లాంట్ల ప్రారంభం

మహానంది: దేవస్థానం పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీ మహానందీశ్వర జలప్రసాదం మినరల్ వాటర్ ప్లాంట్లను బుధవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

దళితులకు న్యాయం చేయాలి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలో దళితులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కొని అన్యాయం చేశారని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వై. ఆశీర్వాదం, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు సోమిశెట్టి మల్లికార్జున, దళిత నాయకులు వి.ఎం.ఎం.ప్రవీణ్ మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. గత 45 ఏళ్లుగా బండ్లబజార్, కుమారస్వామి దేవాలయం, జీటైప్ ప్రాంతాలలో దళితులు సాగు చేసుకుంటున్న భూమును ఇళ్ల పట్టాల కోసం స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు.

పీఎంసీల సమావేశం

పగిడ్యాల: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సుభాన్ కోరారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం తల్లిదండ్రుల కమిటీల సమావేశం నిర్వహించారు.

ఉజ్వల భవిష్యత్తుకు మార్గనిర్దేశం

- పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు
- ప్రభుత్వ పథకాలపై అవగాహన
- విద్యాప్రమాణాల మెరుగుకు తీసుకోవలసిన చర్యలపై చర్చ





నందికొట్కూరు నీలిషికారిపేట ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ల కోసం వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు, సీఎస్‌ఐ స్కూల్‌లో మాట్లాడుతున్న కౌన్సిలరు మండడి వాణి

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. అనేక సంక్షేమ పథకాలతో విద్యారంగంలో అత్యాధునిక మార్పులు చేస్తూ దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేశారు. దీంతో ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్ల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలల ఎదుట బారులు తీరే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం విద్యాశాఖలో అమలు చేస్తున్న పథకాలు, విద్యాభివృద్ధికి తీసుకువస్తున్న మార్పులను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించేందుకు, పాఠశాల స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు తీసుకోవలసిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహిస్తోంది.

విద్యాశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ..

ఈ నెల 26, 27 తేదీల్లో తల్లిదండ్రుల కమిటీ సమావేశాలను ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించారు. ఇందుకు సంబంధించిన అజెండా అంశాలను ప్రభుత్వం సూచించింది. ముందుగా కమిటీ సభ్యులకు హెచ్‌ఎంలు ఆహ్వానం పంపారు. గడిచిన నాలుగేళ్లలో విద్యారంగంలో ప్రభుత్వం తీసుకు వచ్చిన పథకాలను సభ్యులకు తెలియజేశారు. పీఎం కమిటీ సమావేశ వివరాలను మండల విద్యాశాఖ, సెక్టోరల్, ఉపవిద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలియజేయాలి. వారు సమావేశాలను పర్యవేక్షించారు. నియోజకవర్గంలో 32 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 31 ప్రాథమికోన్నత పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 2, ప్రాథమిక పాఠశాలలు 182, రెండు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు, నాలుగు మోడల్స్, ఐదు కస్తూరిబా పాఠశాలలున్నాయి. నియోజకవర్గంలోని ఆయా పాఠశాలల్లో సుమారు 45,630 మంది విద్యార్థులు ఉన్నారు.

సమావేశాల్లో చర్చించిన ముఖ్యమైన అంశాలు

అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, మనబడి–నాడు-నేడు, ఇంగ్లిషు మీడియంలో బోధన, జగనన్న గోరుముద్ద, జగనన్న ఆణి ముత్యాలు, స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ ఏర్పాటు, పాఠశాల మైనర్ రిపేర్లకు నిధుల కేటాయింపు, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు, ఇంటరాక్టివ్ ప్యానెల్ బోర్డు, స్మార్ట్ టీవీ, బైజూస్ బోధనపై చర్చించారు. అలాగే రాగిజావకు గ్లాసుల పంపిణీ, పాఠశాలలకు ఇంటర్నెట్ సదుపాయం, విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఐరన్, అల్బెండజోల్ మాత్రల పంపిణీ, టోఫెల్ పరీక్షల నిర్వహణ, బ్యాక్ టు ప్రోగ్రామ్, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఇంగ్లిష్ మీడియంలో విద్యాయబోధన, సీబీఎస్ఈ సిలబస్‌పై అవగాహన కల్పించారు.

నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు

గురుకుల పాఠశాలలు	- 2
ఆదర్శ పాఠశాలలు	- 4
కస్తూర్బా విద్యాలయాలు	- 5
జెడ్పీ హైస్కూళ్లు	- 32
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	- 2
ప్రాథమికోన్నత పాఠశాలలు	- 31
ప్రాథమిక పాఠశాలలు	- 182
ఐటీడీఏ స్కూళ్లు (గిరిజన సంక్షేమ పాఠశాలలు)	- 5
మొత్త విద్యార్థుల సంఖ్య	- 45,630

ప్రతి పాఠశాలలో సమావేశం జరిగేలా చర్యలు



ప్రతి పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు జరిగేలా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వం సూచించిన ప్రకారం విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను సభ్యులకు తెలియజేశాం. విద్యార్థులందరికీ జేవీకే కిట్లు అందాయో లేదో అడిగి తెలుసుకున్నాం. అమ్మఒడి, గోరుముద్ద పథకాల గురించి చర్చించాం.

– ఫైజున్నీసాబేగం, నందికొట్కూరు మండల విద్యాశాఖ అధికారి

పథకాలపై అవగాహన కల్పించారు



ఇద్దరు కుమారులు షాజీద్, షాహీద్ మోడల్స్ స్కూల్‌లో చదువుతున్నారు. పీఎంసీ సమావేశంలో ఉపాధ్యాయులు, అధికారులు ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇలాంటి సమావేశాలు తరచూ నిర్వహిస్తే ఎంతో మేలు.

– ముబీన, పాములపాడు

వ్యాపారులకు నోటీసులు

మహానంది: దేవస్థానం పరిధిలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకునే హోటళ్లు, ఫ్యాన్సీ, ఇతర షాపుల వారు నిబంధనలు పాటించాలని సూచిస్తూ నోటీసులు జారీ చేసినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారాలు నిర్వహించుకునేవారు పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదని, రహదారికి అడ్డుగా కుర్చీలు వేయరాదన్నారు. అలాగే ప్లాస్టిక్ గ్లాసులు వినియోగించవద్దని ఆదేశించారు. దీంతో పాటు హోటళ్ల యజమానులు ఆహారపదార్థాలను నాణ్యతగా ఉంచాలని, ఎమ్మార్పీకే వస్తువులను విక్రయించాలని నోటీసులో పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుకాణాల్లో పోలీసుల సోదాలు

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని దుకాణాల్లో మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, పోలీసులు మంగళవారం రాత్రి సోదాలు నిర్వహించారు. పలు దుకాణాల్లో గుట్కా, ఖైనీ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

జూపాడుబంగ్లాలో 12.2 మి.మీ వర్షపాతం

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన వర్షం 12.2 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా మండలంలో అత్యధికంగా వర్షపాతం నమోదుకాగా అత్యల్పంగా కొత్తపల్లి మండలంలో 2.8 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసినట్లు తెలిపారు. పాములపాడులో 12.2 మిల్లీమీటర్లు, పగిడ్యాలలో 10.6 ఎం.ఎం, నందికొట్కూరు 9.2 ఎం.ఎం, మిడుతూరులో 4.2 మిల్లీమీటర్ల వర్షం కురిసిందన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు మండలంలో అత్యధికంగా 21.6మి.మీ., ఆత్మకూరు మండలంలో 11.8 మి.మీ, బండిఆత్మకూరులో 4.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

వ్యవసాయరంగానికి పెద్దపీట

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- రైతులకు వ్యవసాయ ఉపకరణల పంపిణీ



రైతులకు ఉపకరణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, నామ్ సంస్థ ప్రతినిధులు

మిడుతూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మండలపరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలో జాతీయ వ్యవసాయరంగ పరిశోధన సంస్థ (ఎన్ఏఏఎమ్) రాజేంద్రనగర్ హైదరాబాదు వారిచే ఎస్‌సీ సబ్ ప్లాన్ పథకం కింద వ్యవసాయ సంబంధిత ఉపకరణాల కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి రైతుల ముంగిటకే సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందజేసిన ఘనత మన సీఎంకే దక్కిందన్నారు. పండిన పంటలకు గిట్టుబాటుధర కల్పించారని గుర్తు చేశారు. వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ వంగాల భరత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పత్తి పంట సాగులో గులాబీరంగు పురుగు ఉధృతి, పొగాకు స్ట్రీక్ వైరస్ వలన పంటలు దెబ్బతింటున్నాయన్నారు. నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు.

రైతులకు శిక్షణ

నామ్ ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ బాలక్రిష్ణ మాట్లాడుతూ నేటి కాలనికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని రైతులు అధికదిగుబడులు సాధించాలని చెప్పారు. నామ్ సంస్థలో శాస్త్రవేత్తలకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు మాట్లాడుతూ నామ్ సంస్థ ద్వారా 346 మంది ఎస్‌సీ రైతులకు రూ. 28 లక్షలు విలువ చేసే వ్యవసాయ సంబంధిత ఉపకరణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతు లకు ఉపకరణాల కిట్లను అందజేశారు. నామ్ సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే సన్మానించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదరనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సల్కోటి గోవర్ధన్‌రెడ్డి, గుండం గోపాల్ రెడ్డి, నాగన్న, రాముడు, నామ్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసర్చ్ (ఆర్ఏఆర్ఎస్ నంద్యాల) డాక్టర్ వెంకటేశ్వర్లు, సైంటిస్టు డాక్టర్ సతీష్ బాబు, నామ్ సంస్థ సీనియర్ సైంటిస్టు డాక్టర్ రమేష్ నాయక్, డాక్టర్ సుప్రియ, ఏడీఓ విజయశేఖర్ పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు పెద్దపీట

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- రెండు బస్సులతో భక్తులకు సైట్ సీయింగ్



మాట్లాడుతున్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: సామాన్య భక్తులకు శ్రీశైల దేవస్థానంలో పెద్దపీట వేస్తున్నామని, మల్లన్నను సామాన్య భక్తులకు దగ్గర చేర్చడమే తమ ధ్యేయమని శ్రీశైల నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. మంగళవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం, క్షేత్రంలో పలు మార్పులు తీసుకురావాలని దేవస్థాన అధికారులతో చర్చించామన్నారు. ఇందులో భాగంగా క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో, లేక దేవస్థాన సహకారంతో క్షేత్ర పరిధిలోని అన్ని ఆలయాలు, ప్రదేశాల సందర్శనకు ప్రత్యేకంగా రెండు బస్సులను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇటీవల క్షేత్రంలో ప్రవేశపెట్టిన ఉదయాస్తమాన సేవ(రూ.1,01,116)పై భక్తులు ఆసక్తి చూపడంలేదని, రూ.25వేలతో నూతన సేవను ప్రవేశపెట్టాలని సూత్రప్రాయంగా నిర్ణయించామని వెల్లడించారు. భక్తుల కోసం గంట ముందు కూడా ప్రత్యేక కౌంటర్ ద్వారా టికెట్లు అందిచాలని ఆలోచిస్తున్నామని అన్నారు. సిద్ధిరామప్ప షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న దుకాణాలను వసతి గదులుగా మార్పులు చేస్తున్నామని తెలిపారు. దేవస్థాన ఉద్యోగులకు శ్రీశైలంలో వసతి సముదాయం కోసం వినతి ఇవ్వడం జరిగిందని దానిని పరిశీలించి నియమ నిబంధనల మేరకు లోబడి అమలు చేస్తామని అన్నారు. త్వరలో శ్రీశైల జగద్గురు పీఠం ఆధ్వర్యంలో 100పడకల వైద్యశాలను భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తామని తెలిపారు. దశాబ్దాలుగా క్షేత్రంలో కాటేజీలు, అన్నదాన సత్రాల కోసం స్థలం పొంది నిర్మాణాలు చేపట్టని వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు. క్షేత్ర భద్రత కోసం రాష్ట్ర డీజీపీ, ఎస్పీలతో కూడా చర్చించానని, త్వరలో పూర్తిస్థాయి పటిష్ట రక్షణ ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్.లవన్న పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



క్షతగాత్రుడు వెస్లీకి దగ్గరుండి చికిత్స చేయిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

మహానంది: ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటామంటూ చెప్పడం కాదు చేసి చూపించారు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని చూసి వెంటనే వాహనాలు ఆపి దగ్గరుండి ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంగళవారం గుండపాడు గ్రామానికి చెందిన వెస్లీ, రాజులు ఆటోలో వెళ్తుండగా స్థానిక పెట్రోల్‌బంక్ వద్ద మరో ఆటో ఢీకొంది. ఈ ఘటనలో వెస్లీ తలకు తీవ్రంగా గాయాలై పడిపోయాడు. అదే సమయంలో శ్రీశైలం నుంచి గిద్దలూరు మీదుగా అటువైపుగా వస్తున్న ఎమ్మెల్యే వద్ద క్షతగాత్రులను చూసి చలించారు. వెంటనే తనతో పాటు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లి దగ్గరుండి, ధైర్యం చెబుతూ చికిత్స చేయించారు. వీఆర్‌పీఎస్ జిల్లా, మండల శాఖ అధ్యక్షుడు మీనిగ నారాయణ, హోటల్ జయరాంతో పాటు స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆధ్యాత్మికం

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

క్షేత్రపాలకుడికి పూజలు

శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం సందర్భంగా శాస్త్రోక్తంగా ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

శైవక్షేత్రాలను దర్శించుకున్న జడ్జి



కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రాలైన కొలనుభారతిదేవి అమ్మవారి క్షేత్రాన్ని, సప్తనదుల సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరాలయాన్ని కర్నూలు ప్రిన్సిపల్ జడ్జి శ్రీనివాసరావు దంపతులు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. సంగమేశ్వరాలయంలో వేపదారు శివలింగానికి నదీ జలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేష పూజలు చేసుకోన్నారు.

వేపదారు శివలింగానికి పూజలు చేస్తున్న జడ్జి దంపతులు

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

కొత్తపల్లి: మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాదారులు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పెద్దన్న, వ్యవసాయాధికారి కె.మహేష్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి ఫర్టిలైజర్స్ మరియు పెస్టిసైడ్స్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మార్పీ కన్నా అధికంగా అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మినా, రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి లింగేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేద్దామని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు చర్చించారు. ఏడు అంశాలను ప్రజాప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పథకాలు అందని అర్హులకు ఎంతో ఉపయోగకరమన్నారు. పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు రాకుండా నిర్మాణాలు పూర్తి చేసేందుకు వీటిని వినియోగిస్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్లు రబ్బానీ, ప్రశాంతి, కమిషనర్ కిషోర్, డీఈ నబి రసూల్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస రెడ్డి, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్లు సకాలంలో వేయాలి

ఆత్మకూరు: పుట్టిన పురిటి బిడ్డ నుంచి 5 సంవత్సరాల వరకు ఉచితంగా పిల్లలకు వ్యాక్సిన్ అందించడం జరుగుతుందని, ఆరోగ్య సిబ్బంది సకాలంలో టీకాలు వేయించాలని నంద్యాల డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆత్మకూరు డివిజన్ పరిధిలోని వైద్యశాలల సిబ్బందితో యుఐపీ విన్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బందికి టీకాలపై శిక్షణ ఇచ్చారు. ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ ప్రభావతి, ప్రోగ్రాం ఆఫీసర్ కాంతరావునాయక్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ షేక్‌నజీం పాల్గొన్నారు.

'జగనన్న శాశ్వత భూహక్కు'తో బహుళ ప్రయోజనాలు

జూపాడుబంగ్లా: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం రైతులు బహుళ ప్రయోజనకరంగా ఉంటుందని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. రెండోవిడతలో భాగంగా తంగడంచ, తరిగోపుల గ్రామాల్లో మంగళవారం సర్పంచ్‌లు ఈశ్వరరెడ్డి, లక్ష్మమ్మ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు.

పాఠశాలలో ఫర్నిచర్ ధ్వంసంపై విచారణ

జూపాడుబంగ్లా: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్యకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవటంతో గ్రామస్తులు మంగళవారం జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు ఎస్‌ఐ కనకయ్యకొట్టాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్దకు చేరుకొని సంఘటనపై పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, వాచ్‌మెన్ శివాచారి, గ్రామస్తులతో ఆరాతీశారు. పాఠశాలలో గతేడాది విద్యను అభ్యసించి పదోతరగతి పూర్తిచేసుకొన్న పాఠశాల నలుగురు విద్యార్థులు వారం రోజుల క్రితం పాఠశాల తాళాలు పగులగొట్టి తరగతి గదుల్లోని టేబుళ్లు, కుర్చీలు, తదితర వస్తువులను ధ్వంసం చేసినట్లు గుర్తించారు. బాధ్యులైన విద్యార్థుల తల్లిదండ్రులను రప్పించి వారిని మందలిస్తామని గ్రామస్తులు, ఉపాధ్యాయులకు ఎస్‌ఐ తెలియజేశారు.

గ్రామ వలంటీర్‌పై దాడి

కొత్తపల్లి: మండలంలోని ఎం. లింగాపురం గ్రామ వలంటీర్‌పై సమీప బంధువులు కట్టెలతో దాడిచేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెలితే గ్రామానికి చెందిన వలంటీర్ పోలకల్లు సరోజ బీసీ కాలనీలో విధులు నిర్వర్తిస్తోంది. ఆమె భర్త తరపు బంధువు పోలకల్లు మద్దిలేటిలకు పొలం డబ్బుల విషయంలో విభేదాలు ఉన్నాయి. అయితే ఇంటి వద్ద డబ్బుల విషయంలో తిట్టుకుంటూ మద్దిలేటి, అతని భార్య హుస్సేనమ్మ, వారు కూతుర్లు రాజేశ్వరి, భారతి సరోజపై కట్టెలతో దాడి చేసి తలపై రక్త గాయాలు అయ్యేలా కొట్టారు. పక్కనే ఉన్న కుటుంబ సభ్యులు ఆమెను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు.

పొట్టేళ్ల పెంపకం లాభదాయకం

వెలుగోడు: గొర్రెలు, పొట్టేళ్ల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ధనుంజయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పశు గణ మిషన్ సహకారంతో పెంపకందారులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గొర్రెలు, మేకలు, విత్తన పొట్టేళ్ల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలన్నారు. ఏడీలు డాక్టర్ రామసుబ్బారెడ్డి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పశువైద్యులు డాక్టర్ జానకి పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు న్యాయం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 1వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నామన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, ఏడీఏ విజయశేఖర్, ఏఈఓ షేక్షావలి, సింగిల్ విండో చైర్మన్ హుసేనయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బానీ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రమణ, రైతు సంఘం నాయకులు సిద్ధారెడ్డి, కౌన్సిలర్లు ధర్మారెడ్డి, జాకీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు వనజ, గోవర్ధన్‌రెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న సురక్ష

కొత్తపల్లి: గ్రామాలలో పక్కాగా జగనన్న సురక్షసర్వే చేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు.మంగళవారం మండలంలోని దుద్యాల, ఎదురుపాడు గ్రా మాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. జగనన్న సురక్షపై సిబ్బందికి సూచనలు చేశారు.

మిడుతూరు: మిడుతూరు -2 సచివాలయాన్ని ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి తనిఖీ చేశారు. జగనన్న సురక్ష సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

నందికొట్కూరు రూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు గ్రామాల్లోనే క్యాంపులు ఏర్పాటు చేసి అందజేస్తామని ఎంపీడీవో శోభారాణి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మహానంది: బొల్లవరం గ్రామంలో సర్వే విధానాన్ని జెడ్పీటీసీ, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీఆర్ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు, శింగవరం గ్రామాల్లో జేసీఎస్ కన్వీనర్ ముడిమెల పుల్లారెడ్డి, ఎంఎల్ఓ పార్థసారధిరెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

వెలుగోడు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి సర్టిఫికెట్లు (జనన, మరణ, కుల, సీసీఆర్సీ, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఆదాయం) మొదలైన 11 రకాల ధ్రువీకరణపత్రాలు సర్వీస్ చార్జ్ లేకుండా ఉచితంగా అందిస్తామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి, మండల జేసీఎస్ కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి తెలిపారు. మంగళవారం వెలుగోడు-3వ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, సచివాలయ కన్వీనర్లు ఉషా, వైస్ ఎంపీపీ నాసిరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.